జిల్లా వార్షిక రుణ ప్రణాళిక రూ.14,259 కోట్లు


బ్యాంకు అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక రూ.14,259 కోట్లుగా నిర్ణయించినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ నెలాఖరు నాటికి జిల్లావ్యాప్తంగా రూ.5,865 కోట్ల రుణాలు మంజూరు అయ్యాయన్నారు. ప్రతి బ్యాంకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ప్రభుత్వం స్వయంఉపాధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు విజయవంతం కావడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. కోనసీమ కొబ్బరి ఆధారిత ప్రాంతంగా ఉన్న నేపథ్యంలో సంబంధిత పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం వర్మ, డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్, నాబార్డు ఏజీఎం స్వామినాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రవాణాశాఖ జిల్లా అధికారిగా శ్రీనివాస్



అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రవాణా శాఖ జిల్లా అధికారిగా దేవిశెట్టి శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో అమలాపురంలోని ఆర్టీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. ఉద్యోగోన్నతి పొందుతూ వచ్చి.. మళ్లీ ఇదే కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారిగా విధులు నిర్వహించనుండడం విశేషం. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మోటారు వాహన చట్టాలు పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వరించిన పదవులు

7 కార్పొరేషన్లలో 14 మందికి చోటు

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్: ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన తెదేపా- జనసేన- భాజపా నేతలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. రాజకీయ, సామాజిక సమీకరణాల తూకంతో 7 కార్పొరేషన్లలో 14 మందికి ఉమ్మడి జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల్లో అవకాశమిచ్చింది.

■ విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా..



అమలాపురం కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి నియమితులయ్యారు. ఆమె 1999లో అల్లవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ దఫా అమలాపురం నుంచి తెదేపా టిక్కెట్ ఆశించినా కొన్ని కారణాల వల్ల దక్కలేదు. తాజాగా నామినేటెడ్ పదవి లభించింది.

■ మార్క్‌ఫెడ్ సభ్యుడిగా గుండుబోగుల



మలికిపురం: రాష్ట్ర మార్క్‌ఫెడ్ సభ్యుడిగా మలికిపురానికి చెందిన గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు) నియమితులయ్యారు. జనసేన రాజోలు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నారు. గత ఎమ్మెల్యే రాపాక పార్టీని విడిచిన తర్వాత 2019-2024 మధ్య నరసింహారావు చురుగ్గా ఉండి కార్యక్రమాలు నిర్వహించారు.

■ కార్పొరేషన్ల సభ్యులుగా..

◆ ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా రాజమహేంద్రవరానికి చెందిన తెదేపా నేత యర్రా వేణుగోపాల రాయుడు ..ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా రాజమహేంద్రవరం మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు, జనసేన నేత జి.స్వరూపాదేవికి అవకాశం దక్కింది. పద్మశాలి సంక్షేమ- అభివృద్ధి కార్పొరేషన్‌లో సభ్యులుగా రాజమహేంద్రవరం తెదేపా నేతలు హరికిషోర్, మత్స్యేటి సత్యప్రసాద్, పిఠాపురం నియోజకవర్గం నుంచి తెదేపా నేత బేతా సత్యనారాయణ, జనసేన నేత సూరిశెట్టి జయనాగకృష్ణలకు అవకాశం దక్కింది.

పౌరసరఫరాలు గాడిన పడేనా..


పవన్‌తో సుధీర్

◆ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్‌గా కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన జనసేన నేత తోట మెహర్ సీతారామ సుధీర్ నియమితులయ్యారు. సభ్యులుగా కాకినాడ సిటీ జనసేన నాయకురాలు కడలి ఈశ్వరి, ముమ్మిడివరం తెదేపా నేత మోకా ఆనంద్ సాగర్, పెద్దాపురం నియోజకవర్గ భాజపా నేత తుమ్మల పద్మజలను నియమించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల వ్యవస్థను గాడిలో పెడతానని ప్రకటించడం.. కాకినాడ కేంద్రంగా సాగుతున్న రేషన్ మాఫియాకు కళ్లెం వేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఛైర్మన్‌తో సహా ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి ఈ కార్పొరేషన్‌లో అవకాశం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ◆ పేదల బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటామని సుధీర్ అన్నారు. ధాన్యం సేకరణ పటిష్ఠంగా చేపట్టి కనీస మద్దతు ధర అందేలా కృషిచేస్తానన్నారు.

■ వినియోగదారుల రక్షణ మండలికి..


నాగిడి నాగేశ్వరరావు

కాట్రేనికోన: రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడిగా కాట్రేనికోన మండలానికి చెందిన నాగిడి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఎన్నికలకు ముందు తుని, కాకినాడ నగర నియోజకవర్గాల పరిశీలకులుగా పనిచేశారు. గతంలో రెండు సార్లు జడ్పీటీసీ సభ్యుడిగా, ఏపీ స్టేట్ టెలికాం డైరెక్టర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు.

◆ పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులైన మోకా ఆనందసాగర్ తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి కూడా.. కాట్రేనికోన సర్పంచిగా పనిచేశారు. గతంలో ముమ్మిడివరం నియోజకవర్గ తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.


మోకా ఆనందసాగర్


యు.కొత్తపల్లిలో నిర్మాణ దశలో ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యా సంస్థ భవనం

పుష్కరమైంది.. పలుకుతారా!

■ వైకాపా నేతల నిర్వాకంతో కేంద్ర విద్యా సంస్థపై నీలినీడలు

■ గుత్తేదారుకు బిల్లులు ఇవ్వక ఆగిన పనులు

ఈనాడు, కాకినాడ

వందల మంది విద్యార్థులకు వివిధ కోర్సులతో స్వయం ఉపాధి చూపాల్సిన సంస్థ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్‌ఎం)... కాకినాడ జిల్లాకు కేటాయించిన ఈ విద్యాసంస్థపై కేంద్రం కరుణించినా .. అక్కడి స్థలంలో రాజకీయం వేలు పెట్టడంతో కొన్నాళ్లు పడకేసింది. అడ్డంకులు తొలగాక పనులు చేస్తున్న గుత్తేదారుకు వైకాపా సర్కారు బిల్లులు ఆపేయడంతో నీలి నీడలు కమ్మేశాయి.

వీడని చిక్కుముళ్లు..

యు.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనే అయిదెకరాల ఖాళీ స్థలంలో తెదేపా ప్రభుత్వం 2014లో శంకుస్థాపన చేసింది. రూ. 1.50 కోట్లు ఖర్చుచేసి పనులు ప్రారంభించాక పిల్లల ఆట స్థలంలో నిర్మాణాలేమిటని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వైకాపా నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తేవడంతో పనులు ఆగాయి. వైకాపా ప్రభుత్వం వచ్చాక చిక్కులు తొలగించుకున్నా.. ప్రాజెక్టు కొలిక్కిరాలేదు. చేసిన పనులకు రూ.2 కోట్ల బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారు ఆపేశారు.

నైపుణ్య వికాసానికి గ్రహణం..

జాతీయ విద్యా ప్రవేశ నిబంధనలు అనుసరించి కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్-క్యాటరింగ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రవేశ పరీక్షల ద్వారా కోర్సులకు అవకాశం కల్పించాలి. విద్యాసంస్థ పూర్తయితే మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ.. ఆహార ఉత్పత్తి, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు, హౌస్ కీపింగ్, ఆఫీస్ ఆపరేషన్స్‌లలో ఏడాదిన్నర వ్యవధితో ట్రేడ్ డిప్లమో కోర్సులూ వస్తాయి. డిగ్రీ కోర్సుకు 80 సీట్లు. . డిప్లమో కోర్సులకు 40 చొప్పున 280 సీట్ల భర్తీ చేయొచ్చు. తిరుపతిలో నిర్మాణం పూర్తయి నడుస్తుంటే.. మనవద్ద పుష్కర కాలంగా ఎదురుచూపులే.

సంస్థ: స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్‌ఎం)
అంచనా వ్యయం రూ.12 కోట్లు
పథకం మంజూరు 07.01.2013
నిర్మాణం పూర్తికి గడువు: 07.01.2016
పనుల ప్రగతి: తరగతి గదులు, పాలన భవనాలు కొలిక్కిరాలేదు. విద్యార్థుల వసతిగృహ నిర్మాణం పునాది స్థాయిలో ఉంది. మౌలిక వసతులు లేవు.

కూటమి ప్రభుత్వం ఊతమిస్తేనే..

హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి కేంద్రం మంజూరుచేసిన నిధుల్లో.. తరగతుల నిర్వహణ, పరిపాలన భవనాలకు రూ.8 కోట్లు.. వసతిగృహ సముదాయానికి రూ.2 కోట్లు.. బోధన సామగ్రి, ఇతర వనరులకు రూ.2 కోట్ల చొప్పున వెచ్చించాలి. ఇప్పటివరకు చేసిన పనులకు రూ.4 కోట్లు మంజూరైతే.. మరో రూ.2 కోట్లు బిల్లులు రావాలి. గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోర్, విద్యుత్తు వైరింగ్ ఆగిపోయాయి. భవన నిర్మాణాలు పూర్తయ్యాక రోడ్లు, మురుగు పారుదల వ్యవస్థ, చుట్టూ వీధి దీపాలు సమకూర్చాలి. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లలో శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధుల విడుదలకు చొరవచూపి విద్యాసంస్థను అందుబాటులోకి తేవాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది.


పునాది దశ దాటని విద్యార్థుల వసతి భవన ప్రాంగణం

మింగేసిన మృత్యువు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల దుర్మరణం


సీతారామరాజు


రాజేష్

ఆలమూరు, న్యూస్‌టుడే: తండ్రి చనిపోవడంతో తల్లికి ఆసరాగా నిలిచినవారు ఒకరైతే.. భార్య, ముద్దులొలికే ఇద్దరు చిన్నారులతో హాయిగా జీవితాన్ని సాగించే వ్యక్తి మరొకరు..ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు ఇంకొకరు.. ఈ ముగ్గురూ మంగళవారం రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం చెందడంతో ఆయా కుటుంబాల్లో చీకట్లు అలముకున్నాయి.

ఆలమూరు మండలంలోని చొప్పెల్ల గ్రామానికి చెందిన వానపల్లి రాజేష్ (30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు(36) వెల్డింగ్ పనుల నిమిత్తం రావులపాలెం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. మంగళవారం సాయంత్రం జొన్నాడ ఏటిగట్టుకు వచ్చేసరికి అదే మార్గంలో మత్స్యకారుల వాహనం కపిలేశ్వరపురం వైపు మలుపు తిరుగుతోంది. ఇది గమనించని వీరు ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఒకరైన రాజేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. తండ్రి చనిపోగా తల్లికి అతనే ఆధారం. ఇంకా వివాహం కాలేదు. మరో మృతుడు సీతారామరాజుకు భార్య, ఆరోతరగతి చదువుతున్న కుమారుడు, నాలుగోతరగతి చదివే కుమార్తె ఉన్నారు. తండ్రి డయాలసిస్ రోగి కావడంతో కుటుంబ బాధ్యత సీతారామరాజు చూసుకుంటున్నాడు. ఇప్పుడు కుటుంబానికి దిక్కెవరంటూ వారంతా రోదిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.అశోక్ తెలిపారు.

శునకం అడ్డురావడంతో..

అమలాపురం పట్టణం: అమలాపురంలోని నల్లవంతెన ప్రాంతానికి చెందిన కుంచే సురేష్‌కుమార్(28) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని పట్టణ సీఐ వీరబాబు తెలిపారు. మంగళవారం ఉదయం కాలేజీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న సురేష్‌కు కుక్క అడ్డురావడంతో పడిపోయారు. కాకినాడకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇటు ఉపాధి.. అటు అభివృద్ధి

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.కోట్లు కేటాయిస్తోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య ఈ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై నిర్లక్ష్యం వహించి, ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో పల్లెల్లో సమస్యలేవీ పరిష్కారం కాలేదు.

కూటమి సర్కారుతో..

కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సంఘం నిధులనుసైతం గత అయిదేళ్లలో పక్కదారి పట్టించిన జగన్ ప్రభుత్వం ఉపాధి హామీ నిధులనూ సద్వినియోగం చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పల్లెలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా పల్లెసీమల రూపురేఖలు మార్చేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రణాళిక సిద్ధం..

జిల్లాలోని 385 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధుల ఖర్చుకు సంబంధించి ఒకే రోజు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆయా గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులపై తీర్మానాలు చేశారు. దీనిలో భాగంగా జిల్లాలో రూ.55 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు.

వివరాలు ఇవీ..	
జిల్లా జనాభా సుమారు	20.35 లక్షలు
గ్రామీణ జనాభా	17.65 లక్షలు
గ్రామీణ జనాభా శాతం	86.73
జాబ్‌కార్డులు	2.26 లక్షలు
యాక్టివ్ కార్డులు	1.56 లక్షలు
2024-25 సంవత్సరానికి జిల్లాకు పని దినాలు	57 లక్షలు
ఇప్పటివరకు పూర్తయినవి	45 లక్షలు
వచ్చిన నిధులు	రూ.55 కోట్లు

రైతులకు అండగా..

ఉపాధి నిధులతో ఈ ఏడాది రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పంట కాలువల నిర్మాణం, పూడిక తీత, పొలం గట్లపై మొక్కల పెంపకం, సరిహద్దు కందకాలు, గడ్డి పెంపకం, షెడ్ల నిర్మాణం, నర్సరీల ఏర్పాటుతోపాటు పల్లెల్లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, సీసీ, బీటీ రహదారులు, పాఠశాలలకు ప్రహరీలు వంటి సదుపాయాలకు పనులు చేపట్టనున్నారు. మినీ గోకులాలకుసైతం ఉపాధి నిధులు ఇవ్వనుంది. గత నెలలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభల్లో గుర్తించిన పనులకు రూ.1,582 కోట్లు అవసరం అవుతాయని నిర్ణయించారు. అంటే వైకాపా హయాంలో పనులేవీ సాగలేదనేందుకు ప్రస్తుత పనుల గుర్తింపే చెబుతోందని పలువురు అంటున్నారు.


అల్లవరం పరిధిలో పనులు చేస్తున్న కూలీలు

మండలాల వారీగా వివరాలు

జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.55 కోట్ల వరకు నిధులు సమకూరనున్నాయి. వీటితో చేపట్టే పనులకు సంబంధించి మండలాల వారీగా వివరాలు సేకరిస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధం చేస్తున్నాం.

- మధుసూదన్, డ్వామా పీడీ

జాతీయ రహదారి నిర్మాణం వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న జేసీ నిశాంతి

అమలాపురం కలెక్టరేట్: జిల్లా పరిధిలో జాతీయ రహదారి-216 అభివృద్ధికి సంబంధించి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ నిశాంతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారులు, రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పెండింగ్ అంశాలపై చట్టపరంగా ముందుకు వెళుతూ జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలన్నారు. రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలపై ర.భ.శాఖ అధికారుల సాయంతో సర్వే చేయాలన్నారు. రాజోలు, మామిడికుదురు మండలాల్లో అభ్యంతరాలు ఎక్కువగా ఉన్నట్లు జేసీ పేర్కొన్నారు. సమీక్ష కార్యక్రమంలో 216 జాతీయ రహదారి ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సహాయం అందించడమే లక్ష్యం

అల్లవరం: వ్యవసాయంలో రైతులకు కావాల్సిన సహాయసహకారాలు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు. గూడాలలో మంగళవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ వరి పంటలో సస్యరక్షణకు డ్రోన్ల వినియోగంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో 1,57,900 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 1,56,446 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిరంజీవిరావు, ఏవో సత్యనారాయణ, పోలిశెట్టి భాస్కరరావు, కృష్ణ సాయి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల బాగుకు ప్రాధాన్యం


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

బొబ్బర్లంక(ఆత్రేయపురం): ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వైకాపా హయాంలో అభివృద్ధి చేయకుండా వదిలేసిన బొబ్బర్లంక(ర్యాలి ఆర్మ్) బ్యారేజీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రహదారి విషయాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్ దృష్టికి తీసుకురాగా వెంటనే ప్రభుత్వ నిధులు రూ.35 లక్షలు విడుదల చేశారన్నారు. ఈ వంద రోజుల పాలనలో ఈ విజయాన్ని కొత్తపేట నియోజకవర్గ ప్రజలే కాకుండా ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు చేజిక్కించుకున్నట్లయిందన్నారు. ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా అప్పటి ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణం అంటూ కొబ్బరికాయ కొట్టి హడావిడి చేసి చేతులెత్తేశారన్నారు. త్వరలో రూ.35 కోట్లతో వెలిచేరు నుంచి బొబ్బర్లంక వరకు ఏబీ రోడ్డు విస్తరణ చేసి అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీనివాసరావు, ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, దాసరి గణేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం అపవిత్రం చేసినవారిని శిక్షించాలి

ముమ్మిడివరం, అంబాజీపేట: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరంలో భారతి పురోహిత సంక్షేమ సంఘం, హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల అవశేషాలు కలిగిన నెయ్యి వాడకం దారుణమైన అపచారమని, ఇది హైందవ సమాజాన్ని అవమానించడమేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదాల తనిఖీలు నిర్వహించాలని కోరారు. ముమ్మిడివరంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఆకొండి రామకృష్ణ, నాగాభట్ల రవిశర్మ, ఆకొండి మహేష్, కొంపెల్ల చైన్లు, కొడమర్తి శర్మ, కొయ్యల దుర్గ, విళ్ల వీరాస్వామినాయుడు, జాగు రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కూటమి శ్రేణులు అంబాజీపేటలో శాంతియుత ర్యాలీ చేశారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు తెలిపారు. పలువురు మాట్లాడుతూ హిందూయేతరులను హిందూ దేవాలయాల నుంచి తప్పించాలని డిమాండ్ చేశాం.


అంబాజీపేటలో ర్యాలీలో నినాదాలు


ముమ్మిడివరం ర్యాలీలో సంఘాల ప్రతినిధులు



ఉషాకిరణాలు.. మెరిసేలా విరులు

వర్షాకాలం వివిధ రకాల మొక్కలు పుష్పించి ఆయా ప్రాంతాలకు కొత్త అందం తెస్తుంటాయి. అరకులో వలిసె పువ్వులు కొండ ప్రాంతాలను పసుపుమయంగా మార్చేయడం పర్యాటకులను ఆకర్షిస్తుంది. అలా చాలాచోట్ల నేల పూసిందా అన్నట్లు వన్నె తేవడం ప్రకృతి ప్రత్యేకత. ఉప్పలగుప్తం మండలం సీతారామపురంలో ఉషోదయ వేళ భానుడి లేలేత కిరణాలు పడి రెల్లుగడ్డి పువ్వులు తెల్లని నెమలి పింఛాల్లా కనిపించాయి. పలువురు ఆసక్తిగా చరవాణి కెమెరాల్లో పదిలపర్చుకున్నారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

అబ్బుర పరిచిన ఆసనాలు

మలికిపురం మండలం బట్టేలంక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమాల్లో పోల్ మల్ల కంభ్, రోప్ మల్ల కంభ్‌ల పై విద్యార్థులు చేసిన విన్యాసాలు, ఆసనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చేసిన విన్యాసాలు తిలకించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వారిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులను అభినందించారు.

- న్యూస్‌టుడే, మలికిపురం



జాతీయ జెండాతో పోల్ మల్ల కంభ్‌పై ఆసనాలు వేస్తూ విద్యార్థులు



రోప్ మల్లకంభ్ పై విల్లు ఆసనం వేసిన విద్యార్థిని

ఆకుల్లో కలసి.. శత్రువులను ఏమార్చి



శరీరం రంగులను మార్చుకోవడంలో ఊసరవెల్లి తనకు తానే సాటి.. రహదారిపై ఉన్న సమయంలో ముదురు ఆకుపచ్చ రంగుల చారలతో కనిపిస్తుంది. అదే మొక్కల మధ్యకు వెళ్లినప్పుడు మనం గుర్తించలేనట్టుగా పూర్తిగా ఆకులో ఆకునై అన్నట్లు తనని తాను రక్షించుకోవడం విశేషం. తుని మండలం నందిజంపు సమీపంలో రోడ్డుపక్కన మంగళవారం 'న్యూస్‌టుడే' కెమెరాకి చిక్కాయి.

- న్యూస్‌టుడే, తుని గ్రామీణం

28, 29న న్యాయవాదుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ కాశి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం కాస్మోపోలిటన్, బార్ అసోసియేషన్ కార్యాలయం వేదికగా ఇవి జరుగుతాయన్నారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా న్యాయవాదులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

29న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక 29న ఉదయం 9 గంటలకు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముప్పన వీరభద్రస్వామి, కార్యదర్శి ఓలేటి సీతాపతిరావు తెలిపారు. 1 జనవరి 2005 తర్వాత పుట్టిన బాలబాలికలు అర్హులన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రం నకలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరని చెప్పారు. వచ్చే నెల 5 నుంచి 7 వరకు విశాఖ జిల్లా నునపర్తిలో జరగబోయే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలబాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు.

అక్రమాలు తెరపైకి.. నిందితులు దొరికేనా..?

డీసీసీబీలో బయటపడుతున్న వైకాపా పాలన నాటి మోసాలు

న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో వైకాపా హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అప్పట్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేశారు. దస్త్రాలు సక్రమంగా నిర్వహించలేదు. సొసైటీలు, బ్యాంకు శాఖల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

డీసీసీబీ కాకినాడ కేంద్రంగా ఉమ్మడి జిల్లాలో 299 సొసైటీలు, 52 బ్యాంకు బ్రాంచిల ద్వారా సేవ లందిస్తోంది. సుమారు రూ.5వేల కోట్ల టర్నోవర్ ఉంది. వైకాపా పాలనలో బ్యాంకు, సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా కమిటీలతో నడిపించారు. అందులో వైకాపా వీరభక్తులకు అవకాశం కల్పించడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరించారు. బ్యాంకు బ్రాంచులు, సొసైటీల్లో ఇచ్చే రుణాల విషయంలో నిబంధనలకు నీళ్లొదిలినా ఉన్నతాధికారులు, పాలకవర్గ కమిటీలు పట్టించుకోలేదు.



డీసీసీ బ్యాంకు

మచ్చుకు కొన్ని..

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కె.గంగవరం బ్రాంచిలో సుమారు రూ.కోటి పైబడి అక్రమాలు జరిగినట్లు సమాచారం. అక్కడ సంబంధిత ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వారి నుంచి సుమారు రూ.50 లక్షలు రికవరీ చేశారు. ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహిస్తున్నారు.
- ఆలమూరు బ్రాంచి పరిధిలోని చింతలూరు పీఏసీఎస్‌లో రూ.70 లక్షల వరకు బాండ్లు లేకపోవడం, షేర్ క్యాపిటల్ దుర్వినియోగం జరిగిన ఉదంతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీనిపై శాఖాపరంగా 51 విచారణ నిర్వహించారు.
- కాకినాడ జిల్లా ఎస్.అన్నవరం పీఏసీఎస్‌లో రూ.కోటికి పైగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీనిపైనా 51 విచారణ జరిపారు.
- జగ్గంపేట మండలం రాజపూడి సొసైటీలో వైకాపా పాలనా సమయంలో సుమారు రూ.అరకోటి వరకు అక్రమాలు వెలుగు చూసినట్లు సమాచారం. దీనిపై జగ్గంపేట బ్రాంచి మేనేజర్, సూపర్‌వైజర్లు నివేదిక ఇచ్చినా డీసీసీబీ ఉన్నతాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

విచారణకు ఆదేశించాం..

ఒకే ఏడాది రుణాల్లో 20 శాతం ఓవర్ డ్యూలోకి వెళ్లడంతో వివరణ అడుగుతున్నాం. అక్రమాలు జరిగినట్లు గుర్తించిన సంబంధిత బ్రాంచి మేనేజర్లు, సూపర్‌వైజర్ల ప్రాథమిక నివేదిక ఆధారంగా సహకార శాఖను వివరణ కోరాం. దీనిపై డీసీఓ శాఖాపరంగా 51 విచారణకు ఆదేశించారు. అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

- ఆర్‌వీ నరసింహారావు, డీసీసీబీ సీఈవో

న్యాయవ్యవస్థపై నిబద్ధత ఉన్న నాయకుడు చంద్రబాబు

భారత న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల



దానవాయిపేట (రాజమహేంద్రవరం): వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీల అమలుకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యుడు, భారత న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు రాష్ట్ర న్యాయవాదులందరి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబుకు న్యాయవ్యవస్థ, న్యాయవాదుల సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతకు ఇటీవల ఆయన తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమన్నారు. న్యాయశాఖ సమీక్షలో పలు అంశాలపై సమీక్ష జరిపి అంతర్జాతీయ న్యాయ కళాశాల, కర్నూలులో హైకోర్టు బెంచ్, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు స్టయిఫండ్ ఇచ్చేలా అవసరమైన ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించడం అభినందనీయమన్నారు. అకాడమీ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం చాలా మంచిదన్నారు. పునర్విభజన చట్టంలోని సెక్షన్-30లో ప్రధాన న్యాయస్థానంతో పాటు హైకోర్టు బెంచ్‌ల నిర్మాణం చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందనే విషయాన్ని గుర్తుచేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఇవ్వడం ఇష్టంలేని మాజీ సీఎం జగన్ ఏకంగా హైకోర్టునే ఆ ప్రాంతానికి తీసుకువస్తామని అక్కడి ప్రజలను వంచించారని విమర్శించారు.

అండర్-14 ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు వాయిదా

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ డీఎస్ఏలో నిర్వహించాల్సిన అండర్-14 ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన క్రీడలన్నీ షెడ్యూల్ ప్రకారం జరుగుతాయన్నారు.



డీజీపీకి వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు సభ్యులు

దళితులకు రక్షణ కల్పించాలని వినతి

అల్లవరం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన మాలమహానాడు సభ్యులు విజయవాడలో డీజీపీ ద్వారకా తిరుమలరావును మంగళవారం కలిశారు. ఆ మేరకు పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో దళితులపై దాడులకు పాల్పడుతూ, వారి మనోభావాలు దెబ్బతినేలా కొందరు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, దళితులకు రక్షణ కల్పించాలని కోరామన్నారు. నాయకులు పండు అశోక్, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, మేఘరాజు తదితరులు పాల్గొన్నారు.

13,677 మందికి ఓటు హక్కు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా జాబితా ప్రచురణ ● నమోదుకు మళ్లీ అవకాశం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ముసాయిదా ఓటర్ల జాబితా మంగళవారం ప్రకటించారు. ఆ జాబితాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్ విడుదల చేశారు. జులై 29 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 14,191 మంది దరఖాస్తు చేయగా, వివరాలు సక్రమంగా ఉన్న 13,677 మందికి ఓటు హక్కు కల్పించారు. ఇందులో 8,062 మంది పురుషులు, 5,613 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు.



కాకినాడ కలెక్టరేట్‌లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను సమర్పిస్తున్న రెవెన్యూ అధికారులు (దాచిన చిత్రం)

ఆరు జిల్లాల పరిధి..

ముసాయిదా జాబితాను తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. ఈ నియోజకవర్గం పరిధిలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి.

అక్టోబరు 15 వరకు..: మంగళవారం నుంచి అక్టోబరు 15 వరకు ఓటు నమోదుకు మళ్లీ అవకాశం కల్పించారు. తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అభ్యంతరాల స్వీకరణ

ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను అక్టోబరు 30లోగా పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురించనున్నారు. అనంతరం ఈ నియోజకవర్గ ఎన్నికలకు ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. మరింత సమాచారం, సహాయం కోసం 1950 టోల్‌ఫ్రీ నంబరు, కాకినాడ కలెక్టరేట్‌లోని ఈఆర్వో కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలివీ..

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు
కాకినాడ	1,723	1,279	1
తూర్పుగోదావరి	1,288	1,080	0
అంబేడ్కర్ కోనసీమ	1,745	889	0
అల్లూరి సీతారామరాజు	288	191	0
ఏలూరు	1,264	1,010	0
పశ్చిమగోదావరి	1,754	1,164	1

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొండేటి ప్రమాణం



చిట్టిబాబును అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా కృషి చేస్తానని జిల్లా పార్టీ అధ్యక్షుడు, పి.గన్నవరం మాజీ ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. అమలాపురం షాదీఖానాలో మంగళవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చిట్టిబాబుతో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తనను వేదికపైకి పిలవకపోవడంతో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పార్టీ కండువాను ప్రభాకరరావుపైకి విసిరేసి మీదకు దూసుకువెళ్తుండగా నాయకులు వారించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జగతా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, జంగా గౌతమ్, అయితాబత్తుల సుభాషిణి, ముషిణి రామకృష్ణారావు, వై.రవీంద్ర, చీకట్ల అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నడుస్తూ నిరసన



మోకాళ్లపై అధ్యాపకులు

మలికిపురం: జీతాల కోసం గత 14 రోజులుగా కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంగళవారం రోడ్డుపై మోకాళ్లపై నడిచి తమ నిరసన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా పాలకవర్గం తమను అన్యాయం చేస్తోందని ఈ సందర్భంగా వారు చెప్పారు. సినీ నిర్మాత, హీరో గుబ్బల రవికిరణ్, రంపాలరాజు, దేశినీడి భాస్కరరావు, రామాంజనేయులు, నల్లి శివ, కె.రంజన్ తదితరులు అధ్యాపకులకు మద్దతు పలికి పాలకవర్గం దిగి వచ్చి జీతాలు చెల్లించాలని కోరారు.

ఖరీఫ్ వరకే ఉచిత బీమా..!

రబీ నుంచి ప్రీమియం చెల్లింపులో రైతుల భాగస్వామ్యం

న్యూస్‌టుడే, సీతానగరం

ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వివిధ పంటలకు ఉచిత బీమా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి, అపరాలు, అరటి పంటలకు వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమా వర్తింపజేశారు. ఈ-పంట ఆధారంగా 4.25 లక్షల ఎకరాల్లో వరి, 28,450 ఎకరాల్లో అపరాలు, 35 వేల ఎకరాల్లో అరటి సుమారుగా 5.25 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేస్తారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండిస్తున్న పంటలు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల బారినపడి నష్టపోతున్నారు. గత అయిదేళ్లలో పెట్టుబడులు పెట్టి పంటలు చేతికొచ్చే సమయంలో అనేక విపత్తుల కారణంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఉచిత బీమా వర్తింపజేయడంతో మేలు జరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బీమా అనేది ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే పరిమితం చేసింది.

రబీలో ఇలా..

రబీ సీజన్‌కు వచ్చేసరికి పంటలపై బీమా వర్తింపునకు నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని రైతులు చెల్లించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ఈ-పంట నమోదుతోపాటు బ్యాంకుల నుంచి రుణం తీసుకునే రైతులు బ్యాంకులోనే అవసరమైన ప్రీమియం చెల్లించాలి. రుణాలు తీసుకోని వారంతా కామన్ సర్వీస్ సెంటర్లలో డీడీ తీసి సంబంధిత బీమా సంస్థ కార్యాలయానికి పంపాలి. వరి, మినుము, పెసర తదితర అపరాలకు 3 శాతం, మొక్కజొన్నకు 6 శాతం ప్రీమియం చెల్లించాలి.



రామచంద్రపురంలో వరి పంట

అవగాహన కల్పిస్తున్నాం..

ఉచిత పంటల బీమా అమలును ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఖరీఫ్‌లో ప్రతి రైతుకు ఉచిత పంటల బీమా అందేలా వ్యవసాయ సహాయకులతో గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. రబీలో ఏయే పంటలకు ఎంత ప్రీమియం చెల్లించాలనే విషయాలను వివరిస్తున్నాం. పంటల బీమాలో ప్రీమియం ద్వారా రైతులను భాగస్వాములను చేస్తాం.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం అర్బన్, పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ఎం.రాజబాబు నిడదవోలు సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీకాగా ఆయన స్థానంలో ఇక్కడికి ముమ్మిడివరం నుంచి ఆర్.రాంబాబు రానున్నారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 కమలప్రియ అనపర్తికి బదిలీకాగా ఆమె స్థానంలో ఏల్లూరు జిల్లా నుంచి పుల్లంరాజు రానున్నారు. పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ కె.సుందరరావు కొవ్వూరు బదిలీకాగా ఆయన స్థానంలో ఇక్కడికి కృష్ణాజిల్లా నుంచి త్రినాథ్ రానున్నారు.

విద్యుదాఘాతంతో తాత్కాలిక ఉద్యోగి మృతి

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా ప్రాంతంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. విద్యుత్తుశాఖలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న ఐ.పోలవరం మండలం పశువుల్లంక శివారు అంబటివారిపేటకు చెందిన మోర్త సాయిరాం(42) అన్నంపల్లి టోల్‌ప్లాజా ప్రాంతంలో 33 కేవీ విద్యుత్తు లైన్లు మరమ్మతులు చేస్తుండగా 11 కేవీ తీగల నుంచి విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్తంభం నుంచి కింద పడిపోయిన సాయిరాం శరీరం కాలిపోయి కొన ఊపిరితో ఉండగా సహచరులు అతనికి సీపీఆర్ చేసి ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జ్వాలాసాగర్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ద్వారపూడి: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మండపేట రూరల్ ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. మండపేట మండలం ద్వారపూడికి చెందిన బాలిక రాజమహేంద్రవరంలో జూనియర్ ఇంటర్ చదువుతోందని, రోజూ కళాశాలకు వెళ్తున్న క్రమంలో రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన యువకుడు సతీష్ ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడన్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్లు బాలిక తన తల్లిదండ్రులకు తెలపగా, మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సతీష్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	10,000
పాతకాయ: గండేరా	16,500
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	13,000
గటగట	10,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,000
కిలో	200

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం రావులపాడులోని శ్రీ లక్ష్మీగణపతి, కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కడురమణీయంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతి ఇస్తున్న సూర్యనారాయణమూర్తి, తదితరులు

అంబాజీపేట: రెడీమేడ్ కిటికీలు, గుమ్మాలు, తలుపులు తయారు చేసి టింబర్‌డిపోలో విక్రయించడం వల్ల వండ్రంగి మేస్త్రీలు, చేతివృత్తిదారులు జీవనోపాధి కోల్పోతున్నారని చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ వెంకటేశ్వరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పితాని బేబిరాణి, భీమశంకర్, సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి

మలికిపురం, న్యూస్‌టుడే: లక్కవరంలో ప్రధాన రహదారి వెంబడి వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కోట పుష్పకుమారి, పంచాయతీ కార్యదర్శి అబ్బాస్‌అలీ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. వీధి దీపాలకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

రహదారిని సరిచేశారు

అంబాజీపేట: అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న రహదారి పల్లపుప్రాంతంలో ఉండటంతో చిన్నపాటి వర్షానికి కూడా చెరువును తలపిస్తోంది. దీంతో ఈనాడు అనేక కథనాలు ఈ రహదారి దుస్థితిపై ప్రచురించింది. దీంతో స్పందించిన సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి ఇక్కడి సమస్యను పరిష్కరించేందుకు రహదారిని ఎత్తుచేసి పొక్లెయిన్ సరి చేయించారు.

గుంత పూడ్చివేత

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక, పేరవరం మధ్య ర.భ రాష్ట్రీయ రహదారి మీటరు లోతు ప్రమాదకరంగా కుంగిపోయింది. నిత్యం వేలాది వాహనాలు అటూ ఇటూ తిరుగుతుంటాయి. ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానికులు అక్కడి గుంత వద్ద హెచ్చరికగా ఒక ఎరుపు ప్లాస్టిక్ సంచి, పిచ్చిమొక్కలు ఉంచి ఉంచారు. ఈ విషయాన్ని ర.భ ఏఈ మణికుమార్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా స్పందించారు. వెంటనే గ్రావెల్ వంటి మెటీరియల్ వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా పూడ్చివేశారు.

కాలువరేవు శుభ్రం

రావులపాలెం పట్టణం: రావులపాలెంలోని ఊబలంక రోడ్డులో కాలువ రేవు వద్ద చెత్తాచెదారాలు పేరుకుని పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు ఇబ్బందులు పడుతుండటంతో ఈనాడు మేమున్నాం మీకు తోడుగా శీర్షికన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్. దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

నదీ పాయలపై అక్రమార్కుల కన్ను

జోరుగా ఇసుక అక్రమ రవాణా

అయినవిల్లి, అంబాజీపేట, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలకు ఏర్పడిన ఇసుక కొరత కొందరు అక్రమార్కులకు కాసుల పంట పండిస్తుంది. ఇటీవల గోదావరికి వచ్చిన వరదల కారణంగా ఇసుక ర్యాంపులు అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ఆ అక్రమార్కుల పంట పండింది. గృహనిర్మాణదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు నదీ పాయలపై కన్నేశారు. గోదావరికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నదీపాయాల నుంచి ఇసుకను పడవల సహాయంతో ఒడ్డుకు తరలిస్తున్నారు. అయినవిల్లి మండలంలోని పొట్టిలంకలో ఈ తరహా దందా నడుస్తోంది. నదీపాయ నుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చి అక్కడ నుంచి ట్రాక్టర్లపై రవాణా చేస్తున్నారు. ఇందులో అందినకాడికి వారు దండుకుంటున్నారు.



అయినవిల్లి మండలం పొట్టిలంకలో తరలిస్తున్న ఇసుక

నిత్యం దందా...

గోదావరి నదీపాయల నుంచి తరలించిన ఇసుకను అక్రమ రవాణా చేయడానికి రాత్రి పగలు తేడా లేకుండా ఈ దందా నడుస్తోంది. గోదావరిలోంచి తీసిన ఇసుక ట్రాక్టరు రూ.నాలుగు నుంచి రూ.ఆరువేలు వరకు విక్రయిస్తున్నారు. అయితే ఈ తంతును రాత్రి పగలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రెండు రోజులుగా మండలంలోని పొట్టిలంక గ్రామంలో అయినవిల్లి మండలం, ముమ్మిడివరం మండలం సరిహద్దు పరిసరాల నుంచి పడవలపై ఇసుక ఒడ్డుకు తీసుకొచ్చి పొక్లెయిన్‌తో ట్రాక్టర్లపై ఎగుమతి చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. సమీప గ్రామాలకు, ముమ్మిడివరం తదితర ప్రాంతాలకు తరలించిచి సొమ్ము చేసుకుంటున్నారు.

అనుమతులు తప్పని సరి

అయినవిల్లి మండలంలో ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు ఇప్పటి వరకు లేవు. ఎవరికీ మేము అనుమతులివ్వలేదు. ఇసుకను ఎవరైన అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులకు సమాచారం అందించి రవాణా చేస్తున్న వాహనాలు సీజ్ చేస్తాం.

- నాగలక్ష్మమ్మ, తహసీల్దార్, అయినవిల్లి

తాగునీరు అందించేందుకు కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆర్.ఏనుగుపల్లిలో రూ.28.70లక్షల అంచనా వ్యయంతో 30 వేల లీటర్లతాగునీరు ట్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం కె.ఏనుగుపల్లిలో రూ.39.90 లక్షలతో 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపు, పైపులైన్ విస్తరణ కార్యక్రమాలకు ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, సర్పంచులు దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యులు యండ్ర విజయలక్ష్మి, కొల్లు సూర్యనారాయణ, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

3 నుంచి వీణాశ్యామలాంబ శరన్నవరాత్రి మహోత్సవాలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలోని శ్రీ వీణా శ్యామలాంబ చంద్రశేఖరస్వామి వార్ల శరన్నవరాత్రి మహోత్సవాలను వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు స్థానిక ఆలయం వద్ద నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ, భక్త బృందం సభ్యులు మంగళవారం తెలిపారు. 3న కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై 12న శమీపూజతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.



గెద్దాడలో నిరసిస్తున్న జేఏసీ నాయకులు

రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మ దహనం

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగించి ఆ మహనీయుడిని అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వైఖరిపై ఎస్సీ సంఘాల జేఏసీ నాయకులు మండలంలోని గెద్దాడలో మంగళవారం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రఘురామకృష్ణరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. జేఏసీ నాయకులు బత్తుల మురళీకృష్ణ, చింతా రాజబాబు, కొల్లాబత్తుల సతీష్, చింతా మధు, దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మలికిపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బట్టేలంక జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంఈవో ఎం.విజయశ్రీ, ఎంపీపీ వెంకటసత్యవాణి, జడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్నకుమారి, సర్పంచి సీతాలక్ష్మి, ఎంపీటీసీ లలితాశిరీష పాల్గొన్నారు.

రావులపాలెం గ్రామీణం: ఈతకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తపేట నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించారు. నాలుగు మండలాలకు చెందిన 102మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను విద్యాకమిటీ ఛైర్మన్ పి.రమేష్, సర్పంచి సుబ్బలక్ష్మి నాగేశ్వరరావు, ఉప సర్పంచి నాగార్జున, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, పీఈటీ రామకృష్ణలు అభినందించారు.

అంబాజీపేట: ఈ నెల 18,19 తేదీల్లో అంబాజీపేటలో జరిగిన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, యోగా పోటీల్లో ప్రతిభ చూపి తొండవరం విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం కేశవాచార్యులు, పీడీ పెద్దిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. క్రీడాకారులను ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటసుబ్బారావు, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, ప్రకాష్, సర్పంచి దొరబాబు, ఎంపీటీసీ దొరబాబు అభినందించారు.

● రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీల్లో గంగలకుర్రుఅగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారని హెచ్ఎం శ్రీహరిరావు తెలిపారు. ఈ నెల 20,21వ తేదీల్లో విజయవాడ పడమట స్టేడియంలో జరిగిన అండర్-19 స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఉమ్మడి తూ.గో. జిల్లాల నుంచి మట్టపర్తి గ్రీష్మశ్రీ, ఇళ్ల మనోజ్‌నాగదీప్తి, దంగేటి విద్యాసాయిశ్రీలకు కాంస్యపతకాలు, మెరిట్ ధ్రువీకరణ పత్రాలు అందించారని హెచ్ఎం తెలిపారు.



నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు

నిందితులకు శిక్ష తప్పదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా రాజోలులో కూటమి నాయకులు దీక్ష చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఈ వ్యవహారంలో నిందితులు ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. గత వైకాపా ప్రభుత్వం కాసులకు కక్కుర్తిపడి ఇటువంటి దురాగతాలకు పాల్పడిందన్నారు. గుండుబోగుల పెద్దకాపు, సూరిశెట్టి శ్రీనివాస్, పితాని శ్రీనివాస్, అడబాల విజయ్, చాగంటి స్వామి, నామన షణ్ముఖ్, కోళ్ల బాబి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అర్చకస్వామి

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రావులపాలేనికి చెందిన కటారి రంగరాజు మంగళవారం రూ. 1,05,116 విరాళం అందించారు. వీరికి డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు స్వామి చిత్రపటం అందించారు.

నిధులు లేక.. ఏడాదిగా వదిలేశారు



మామిడికుదురు-2 సచివాలయాన్ని స్థానిక శ్మశానవాటిక ఎదురుగా రూ. 40 లక్షల అంచనా వ్యయంతో గత వైకాపా పాలకులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. రూ.30 లక్షల మేర పనులు పూర్తయినా ఏడాదిగా ఇలా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. నిధులు అందకపోవడంతో ఇలా మధ్యలోనే వదిలేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. శ్మశానవాటికకు 10 అడుగుల దూరంలో దీనిని నిర్మించడంతో అక్కడకు వెళ్లి విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ జేఈ కృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా నిధులు వచ్చిన వెంటనే మిగతా పనులు పూర్తి చేస్తామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సైతం తెలియజేశామని చెప్పారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

రైతుల కళ్లలో ఆనందం



మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్‌ఛార్జి శ్రీనివాస్

రావులపాలెం గ్రామీణం: అయిదేళ్ల వైకాపా పాలనలో రైతులకు ధాన్యం నగదు రాక నానా ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వంలో రైతుల బకాయిలు తీర్చి వారి కళ్లలో ఆనందం చూసిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొమరాజులంకలో మంగళవారం మాజీ ఉప సర్పంచి గుర్రాల నాగభూషనం ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, డీసీఎమ్మెస్ మాజీ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షులు గుత్తుల రాంబాబు, తోట స్వామిలు హాజరై ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ కరపత్రాలను అందించారు.

అయినవిల్లి: సంక్షోభంలోను సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం విలస గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో నామన రాంబాబు,, తెదేపా రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, కుడిపూడి దుర్గారావు, కళ్లేపల్లి వెంకటసుబ్బరాజు, అక్కిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: వంద రోజుల్లోనే పలు పథకాలు అమలుకు నోచుకున్నాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈదరాడలో మంగళవారం జరిగిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సర్పంచి చుట్టుగుల్ల లక్ష్మి, ఎంపీపీ కుసుమ వనజకుమారి, డీపీవో డి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: సచివాలయం 2 పరిధిలో మారుతి సెంటర్ వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గుబ్బలమూర్తి, దూనబోయినప్రదీప్, జోగిగనిరాజు పాల్గొన్నారు.

అంబాజీపేట: ఇసుకపూడిలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు, తెదేపా నాయకుడు సాయిబాబు, పళ్ల శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగమణి పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా అశోక్



ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండల ట్రాన్స్‌కో ఏఈగా టి.అశోక్ నియమితులయ్యారు. ఆయన గోకవరం మండలం నుంచి బదిలీపై వచ్చి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు పనిచేసిన ఏఈ బాపిరాజు రాజమహేంద్రవరం బదిలీపై వెళ్లారు.

వరద బాధితులకు చేయూత



సీఎం చంద్రబాబుకు విరాళం అందిస్తున్న వెంకటరామయ్య, శ్రీను

అయినవిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ-2 సభ్యుడు ఇందుగుల వెంకటరామయ్య, ఆయన కుమారుడు శ్రీను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాదపుర్వకంగా కలిశారు. వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేశారు.

అంబాజీపేట: విజయవాడ వరద బాధితులకు 98 మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) టీచర్స్ ఫెడరేషన్ ఒక రోజు వేతనాన్ని సాయంగా అందించిందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్ తెలిపారు. వరద బాధితులకు సాయంగా అందించేందుకు రూ.36 లక్షలకు సంబంధించి మంత్రి నారా లోకేష్‌కు మంగళవారం విజయవాడలో అంగీకారపత్రాన్ని సంఘం నాయకులు అందించారని ఆయన చెప్పారు. అనంతరం ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నదుల అనుసంధానం మన బాధ్యత

ఆలమూరు న్యూస్‌టుడే: ప్రస్తుత తరం వారు నదులను కాపాడి భవిష్యత్తు తరాలవారికి స్వచ్ఛమైన జలాలను అందిచాల్సిన అవసరం ఉందని ఆలమూరు మండల విద్యాశాఖాధికారి అప్పాజీ అన్నారు. మంగళవారం ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులందరూ కొత్తూరు సెంటర్‌లో మానవహారంగా నిలబడి నదుల పరిరక్షణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి.వెంకట్రావు, పి. సత్యానారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు పెట్టాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాలకు సంబంధించి గ్రామాల్లో ప్రతి నెలా విధిగా అవగాహన సదస్సులు నిర్వహించాలని దళిత చైతన్య వేదిక నాయకులు మామిడికుదురులో తహసీల్దారు బి.మృత్యుంజయరావును మంగళవారం కలిసి విన్నవించారు. ఈ చట్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. సంఘ అధ్యక్షుడు బత్తుల మురళీకృష్ణ, చింతా మధుకుమార్, మందపాటి మధు, కుమార్, శ్రీనివాస్ విన్నపాలు చేసిన వారిలో ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.అన్నపూర్ణ కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థచే ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం పీఎంసీ సభ్యులు సత్కరించారు. విద్యాభివృద్ధికి ఆమె చేస్తున్న సేవలను అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ కొప్పాడి శ్రీదేవి, వైస్ ఛైర్మన్ నల్లి రత్నశ్రీ, జి.పెద్దింట్లమ్మ, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి నిత్యాన్నదాన ట్రస్టుకు సహకరించాలని వినతి

కొత్తపేట: వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్యులు నిర్మించబోయే నిత్యఅన్నదాన ట్రస్టు నిర్మాణానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని వాసవి నిత్య అన్నదాన ట్రస్టు సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కోరారు. అనంతరం బండారును సన్మానించారు. కార్యక్రమంలో కంచర్లబాబి, మన్యంభాను, మన్యం వర్ధనరావు, యలమర్తిరాంబాబు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ పితామహుడు వీకేఆర్‌వీ రావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ సాయిబాబు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు అందరూ చదువుతోపాటు సామాజిక సేవాదృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మనాభం, నల్లి రాజు, సరిత, అశ్వినిరెడ్డి, జగదీష్, మధుకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీ బిల్లు కలెక్టర్ మృతికి సంతాపం



సూర్యమోహన్ (పాతచిత్రం)

అంబాజీపేట, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల నుంచి పుల్లేటికుర్రు గ్రామపంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్న పెద్యాల సూర్యమోహన్(27) మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. అమలాపురం రూరల్ మండలం భట్నవల్లికి చెందిన ఆయన మంగళవారం జిమ్‌కి వెళ్లి ఇంటికి వచ్చారు. తన తల్లితో నాకు కొంచెం అనారోగ్యంగా ఉందని చెప్పడంతో పాటు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో అమలాపురంలోని ఓ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే సూర్యమోహన్ మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు.

బొబ్బర్లంకలో ఇసుక సీజ్

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: బొబ్బర్లంకలో ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా తవ్వి డంప్ చేసిన నాలుగు యూనిట్లు ఇసుకను మంగళవారం ఆత్రేయపురం రెవెన్యూ అధికారి టి.రాజేశ్వరరావు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను పంచాయతీ కార్యదర్శి హనుమకు అప్పగించారు.. ఎవరైనా అనుమతుల్లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భవాని, వీఆర్వో ఏలియా తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో ఐదుగురికి శిక్ష

రాజోలు, న్యూస్‌టుడే: మహిళను అగౌరవపరచి, గాయపరిచిన కేసులో ఐదుగురు వ్యక్తులకు ఒక ఏడాది జైలుశిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ రాజోలు జూనియర్ సివిల్‌జడ్జి కె.హిమబిందు మంగళవారం తీర్పు వెల్లడించారని ఎస్సై రాజేష్‌కుమార్ తెలిపారు. 2019 మార్చి 6న మండలంలోని సోంపల్లికి చెందిన మల్లాడి దుర్గాకాళేశ్వరి ఒక కాలువ విషయంపై గొడవ జరిగింది. తనపై అదే గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావు, చింతా దుర్గ, చింతా కిరణ్, పొన్నమండ విజయలక్ష్మి, పొన్నమండ శ్రీను అను ఐదుగురు వ్యక్తులు అగౌరవపరచడంతో పాటు తనపై దాడి చేశారని రాజోలు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నేరం రుజువుకావడంతో వారికి ఈ శిక్షలు ఖరారు చేశారు.

ఇవి రోడ్లు.. వెళ్లాలంటే తిప్పలు



ముక్కామల- పసుపల్లి రహదారి

అంబాజీపేట, అయినవిల్లి, న్యూస్‌టుడే: ముక్కామల నుంచి పసుపల్లి వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి మరీ అధ్వానంగా మారింది. రహదారి గుంతలు ఏర్పడటంతో ఓ మోస్తరు వర్షానికి కూడా అందులో నీరు నిలిచిపోతుంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముక్కామల నుంచి పసుపల్లి, వక్కలంక, మడిపల్లి, చింతనల్లంక, రాయుడుపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి సక్రమంగాలేక వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. దీనిపై మండల ఇంజినీరింగ్ అధికారి కృష్ణంరాజు మాట్లాడుతూ ముక్కామల నుంచి పసుపల్లి బియ్యం మిల్లు వరకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపుతామన్నారు. అయినవిల్లి మండలం తొత్తరమూడి రహదారి వర్షం దెబ్బకి గుంతల్లో నీరు చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం బస్టాండు సెంటర్ నుంచి గాదిరాజు పికానా ఫుడ్స్ భవనం మీదుగా బండారు కాలనీకి వెళ్లే సిమెంటు రోడ్డు మురుగు కాలువలా మారిపోయింది. ఏడాదిగా వర్షపునీరు, ఇళ్లలోని వాడకం నీరు ఎటూ వెళ్లకుండా అలాగే ఉండిపోతోంది. ఒక పక్క ప్రజలు జ్వరాల బారిన పడి బాధపడుతుంటే ఇలాంటి మురికి కూపాలు మరింత బాధిస్తున్నాయి. దీనిపై ఈవోపీఆర్డీ శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశీలించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



తొత్తరమూడి రహదారిలో గుంతలు



ఆత్రేయపురం బస్టాండు నుంచి బండారు కాలనీకి వెళ్లే మార్గం దుస్థితి

తొట్టి వంతెనపై ఇనుప రెయిలింగ్‌ల చోరీ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం గోదావరి కొత్త బ్రిడ్జి తొట్టివంతెనపై ఉన్న 16 విలువైన ఇనుప రెయిలింగ్స్ సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. దీనిని గమనించిన జలవనరుల శాఖ ఏఈ సుందర్‌సింగ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు.

పుదుచ్చేరి ఎల్జీని కలిసిన మల్లాడి

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథ్, సీఎం తదితర ప్రముఖులను మంగళవారం సాయంత్రం కలిసి వివిధ అంశాలపై మాట్లాడి, సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. పుదుచ్చేరి నుంచి మీడియాతో మంగళవారం మాట్లాడారు. యానాంలో జూదాన్ని రాజకీయంగా ఎవరు ప్రోత్సహిస్తున్నారు, ఏపీ అధికారులకు ఇందులో భాగస్వామ్యం ఉండనే వివరాలు తెలిపానన్నారు. రాజ్‌నివాస్‌లో ఎల్జీ కైలాష్‌నాథ్‌తో మట్లాడానని, పలు అంశాలపై సానుకూలంగా స్పందించారన్నారు. లింకింగ్ ఛానెల్ ఏర్పాటుకు మంత్రి లక్ష్మీనారాయణన్ అంగీకారం ఇచ్చారన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

కూరగాయల విత్తనాల కిట్ల పంపిణీ

యానాం, న్యూస్‌టుడే: ఇళ్ల, పొలాల గట్లపై తోటలు, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు యానాం వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రైతులు, మహిళలకు మంగళవారం కూరగాయల విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ద్రాక్షారామ రోడ్డులోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో 600 మందికి ఒక్కొటి రూ.250 విలువైన కిట్లను ఎమ్మెల్యే అశోక్ పంపిణీ చేశారు. డీడీఏ శివసుబ్రహ్మణియన్, సత్యభాస్కర్, జోగిరాజు, ఖాన్, సుబ్బారావు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో పెరటి తోటల పెంపకంలో మెలకువల గురించి ఆహార భద్రత విభాగం అధ్యక్షులు విశ్వనాథపల్లి ఆదెమ్మ వివరించారు.



అనాతవరంలో గోడపత్రికల ప్రదర్శన

రైతులకు చేరువగా శాస్త్రీయ పరిజ్ఞానం

ముమ్మిడివరం: రైతులకు సాగులో శాస్త్రీయ పరిజ్ఞానం, పథకాలు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని ముమ్మిడివరం మండల వ్యవసాయాధికారి ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. అనాతవరంలో సర్పంచి మిమ్మితి చిరంజీవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కురసాల శివబాబు, ఆండే శ్రీను, వసవర్ల సత్యనారాయణ, పేరిచర్ల సురేష్‌రాజు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రేనికోన: చెయ్యేరు, పెనుమళ్ల గ్రామాల్లో సర్పంచులు చెల్లి సురేష్, ఏడుకొండలు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి ప్రస్తుతం వరిలో వ్యాపించే సుడి దోమ, బాక్టీరియా, ఎండు తెగులు వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించి సూచనలు చేశారు. ఏవో ప్రవీణ్. మత్స్యశాఖ, వ్యయసాయ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం గ్రామీణం: భట్నవిల్లి, రెడ్డిపల్లిల్లో ఏవో కె.ధర్మప్రసాద్, సర్పంచి తిరుకోటి సుజాత, డి.ప్రేమ్‌కుమార్, కరాటం ప్రవీణ్, సూర్యభాస్కరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం.. యువతకేదీ సదుపాయం..!

అమలాపురం మండలం ఎ.వేమవరంలోని డిజిటల్ గ్రంథాలయ భవనమిది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ భవనానికి రూ.16 లక్షలు కేటాయించారు. నిధులు సరిపోకపోవడంతో ఆయుద్దేశ్యం పాలనలో పూర్తి కాలేదు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో నైనా ఈ భవనాన్ని, గ్రంథాలయ సేవలను అందుబాటులోకి తీసుకొస్తే తమకు సౌకర్యంగా మార్యాలని యువత కోరుతున్నారు.



ఎ.వేమవరంలో అసంపూర్తిగా డిజిటల్ గ్రంథాలయ భవనం

మండలాలు : అమలాపురం గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం	నియోజకవర్గంలో వివరాలు
గ్రామాలు : 60	
మండలానికి కేటాయించినవి : 6	
ఒక్కో భవనానికి నిధులు : రూ.16 లక్షలు	
మొదలైన భవనాలు : 1	పూర్తయిన భవనాలు : 0

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, యువత నైపుణ్యాలు పెంపొందించుకునే దిశగా డిజిటల్ గ్రంథాలయాలు తీసుకొస్తున్నామని గత వైకాపా పాలనలో ప్రగల్భాలు పలికారు. ఆరంభించేసినట్లు ఆర్భాటం చేశారు. దశల వారీగా గ్రామాల్లో గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా అపరిమిత ఇంటర్నెట్ సేవలు ఉంటాయని అప్పట్లో ప్రకటనలు గుప్పించారు. అవి నేటికీ పూర్తికాని పరిస్థితి పలుచోట్ల కనిపిస్తోంది. అమలాపురం నియోజకవర్గంలోని ఈ నిర్మాణాలకోసం స్థలాలు సేకరించినప్పటికీ పనులు మొదలుకాలేదు. మొదలైన ఒక చోటకూడా అసంపూర్తి నిర్మాణమే దర్శనమిస్తోంది.

భవనాలు ఎక్కడెక్కడంటే..!

అమలాపురం మండలం : ఎ.వేమవరం, ఈదరపల్లి, పేరూరు, కామనగరువు, కామనగరువు-1, బండారులంక-1

ఉప్పలగుప్తం మండలం : గోపవరం, మునిపల్లి, ఉప్పలగుప్తం, విలసవిల్లి, భీమనపల్లి, ఎస్.యానాం

అల్లవరం మండలం : గోడి, బోడసకుర్రు, కొమరగిరిపట్నం, అల్లవరం, గోడిలంక, దేవగుప్తం

నిధులేక.. కలగానే మిగిలి..

డిజిటల్ గ్రంథాలయ అందుబాటులోకి తీసుకురావాలని గత వైకాపా ప్రభుత్వం సంకల్పించింది. గ్రంథాలయాల్లో మూడు కంప్యూటర్లు, ఫైబర్‌నెట్, ప్రింటర్, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేసింది. ఇందులో 50 నుంచి 60 మంది కూర్చునేందుకు వీలుగా ఆధునిక వసతులు సమకూర్చేందుకు సంకల్పించింది. ఆయితే భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మాత్రమే కేటాయించడంతో గుత్తేదారులు ముందుకురాని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ గ్రంథాలయాలు ఏర్పాటు ఆయుద్దేశ్యం కలగానే మిగిలిపోయింది.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. ఆయితే నిధులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలో భవన నిర్మాణాలపై తీసుకునే నిర్ణయం ఆధారంగానే నిర్మాణాలు చేపడతాం.

- పి.ఎస్.రాజ్‌కుమార్, డీఈఈ, పంచాయతీరాజ్



పి.గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ సంఘీభావం

దోషులను కఠినంగా శిక్షించాలి

అమలాపురం గ్రామీణం: తిరుమల తిరుపతి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి ప్రసాదం కల్తీ జరిగిన ఘటనకు సంబంధించి దోషులను కఠినంగా శిక్షించాలని బండారులంక హిందూ యువత డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని మంగళవారం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సందర్శించి సంఘీభావం తెలిపారు. శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచి పెనుమాల సునీత, చింతా శంకరమూర్తి, బట్టు పండు, కాశిన ఫణీంద్ర, తులా సతీష్, మావూరి శివ, అక్కిశెట్టి వెంకటేష్, కాశిన శ్రీను, ఉప్పుగంటి సాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఐ.పోలవరం: వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి కాకినాడ వాసి ఎం.రాంబాబు కుటుంబ సభ్యులు మంగళవారం రూ.10 వేలు విరాళం ఇచ్చారు. ఆలయ పర్యవేక్షణాధికారి సత్కరించారు.

'యానాం అభివృద్ధిని మల్లాడి అడ్డుకుంటున్నారు'



ఎమ్మెల్యే అశోక్

యానాం, న్యూస్‌టుడే: యానాం అభివృద్ధిని మూడేళ్ల నుంచి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నిరకాలుగా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆరోపించారు. మంగళవారం సాయంత్రం బెజవాడగార్డెన్‌లోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మల్లాడిపై విమర్శలు చేశారు. మల్లాడి సవాల్ స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఆయనకు ప్రజలే గుండుకొట్టి పంపిస్తారన్నారు. ముఖ్యమంత్రి రంగసామి సహకారంతో అన్నిపనులు చేస్తున్నానంటున్న మల్లాడి యానాంలో జూదగృహాలు మాత్రం నేనే తీసుకొచ్చానని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. మల్లాడి పాతికేళ్ల పాలనలో జరిగిన తప్పులన్నింటినీ కొద్ది రోజుల్లో బహిరంగసభ ఏర్పాటుచేసి ప్రజల సమక్షంలో బయటపెడతానన్నారు. ఈ మూడేళ్లలో అభివృద్ధి పనులకు ఆలస్యమవుతుందేమో తప్ప, ఎలాంటి తప్పు జరగకుండా తాను చేస్తున్నానన్నారు. రీజెన్సీ పరిశ్రమ రాకుండా మల్లాడి అడ్డుకుంటున్నారని, దాని గురించి ఆ పరిశ్రమ ఎండీ త్వరలో యానాం వచ్చి మాట్లాడతారన్నారు. వివిధ డిమాండ్లతో తాను ఆమరణదీక్ష చేసినపుడు పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటీ కార్యరూపం దాల్చలేదన్నారు. యానాంలో ఇంతవరకు కార్యాలయాన్నే ప్రభుత్వం తనకు ఏర్పాటు చేయలేదని వాపోయారు. త్వరలో యానాం రానున్న ఎల్జీకి సమస్యలు వివరిస్తానన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించే మంచి ప్రభుత్వం



అనాతవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పలువురు నాయకులు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని క్రాపచింతలపూడిలో మంగళవారం 15వ వార్డు కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగకుమారి, దొమ్మేటి రమణకుమార్, మాదాల పరంకుశం, శ్రీధర్, పిల్లా శ్రీదేవి తదితరులు ఇంటింటా కరపత్రాలు పంచారు. అనాతవరంలో కురసాల శివబాబు, మిమ్మితి చిరంజీవి, పేరిచర్ల సురేష్‌రాజు, గుబ్బల తాతబ్బాయి, వాసంశెట్టి పట్టాభిరామయ్య తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొత్తలంకలో కూటమి నాయకులు దూడల స్వామినాయుడు, గీసాల చంద్రరావు, వీపూరి నాగరాజు వర్మ, కొడమర్తిశర్మ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కుండలేశ్వరం, ఉప్పూడి, మొండిపోర, సత్తెమ్మచెట్టు, పల్లంకుర్రు, గెద్దనపల్లి, బలుసుతిప్ప, కొప్పిగుంట తదితర గ్రామాల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు ఇంటింటికీ తిరిగి 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పనులు వివరించి కరపత్రాలు అందించారు. నాగిడి నాగేశ్వరరావు, రేవు రమేష్, పీటీ వర్మ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గతంలో పాలన సాగించిన వైకాపా ప్రభుత్వం రైతుల ధాన్యం కొని బకాయి పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. చల్లపల్లిలోని చింతలచెరువులో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడారు. పింఛను తెచ్చింది, పెంచింది తెదేపా ప్రభుత్వమేనని గుర్తుచేశారు. 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు రఘుబాబు మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఆనందరావును కోరారు. సర్పంచి జయమణి, చెల్లయ్యానాయుడు, లక్ష్మీనారాయణ, ముసలయ్య, బుజ్జిదొర, నాగరాజు, శివాజీ, రవీంద్రబాబు, అరవింద్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో..



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

నిరంతర సాధనతో జాతీయ స్థాయిలో మెరవాలి

ఉప్పలగుప్తం: విద్యార్థులు నిరంతర సాధన చేస్తూ పోటీల్లో నెగ్గి జాతీయ స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే ఆనందరావు ఆకాంక్షించారు. గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన నియోజవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ పాలనలో వెనుకబడిన గొల్లవిల్లి పాఠశాల వైభవాన్ని తిరిగి తెస్తామని, జాతీయ స్థాయి క్రీడలు ఇక్కడే జరిగేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎస్.యానాం సముద్ర తీరంలో జాతీయ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. నానాజీ, లక్ష్మీనారాయణ, శ్రీదుర్గ, సంపదరావు, సత్తిబాబు, రమణబాబు, ఏసుబాబు, బాలకృష్ణ, రాణి, మధు, ఫణి, గణేశ్వరరావు, మూర్తి, ఈశ్వరరావు, సంజీవయ్య, సరస్వతి, వినాయకుడు పాల్గొన్నారు.

● అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు ఉప్పలగుప్తంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్నారు. వరి క్షేత్రంలో డ్రోన్‌తో పురుగుమందు పిచికారీని పరిశీలించారు. ఏవో కుమార్‌బాబు, ఏడీఏ షంషీ, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

అల్లవరం: గోడి గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రామచంద్రపురంలో నిర్వహించిన అండర్-19 విభాగంలో బేస్‌బాల్ క్రీడలో ఐ.ఉదయ్, సాఫ్ట్‌బాల్‌లో ఎం.అభిరామ్, విజయం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఇటీవల జరిగిన ఊబలంక అథ్లెటిక్స్ పోటీల్లోనూ అండర్-18 విభాగంలో షాట్‌పుట్‌లో ఉదయ్‌కుమార్ ప్రథమ, ఎం.బాబి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. జావెలిన్ త్రోలో అండర్-20 విభాగంలో ఎస్.సతీష్ ప్రథమస్థానం సాధించారన్నారు. వీరిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

జిల్లా స్థాయికి ఎంపిక..

కాట్రేనికోన: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పాఠశాల క్రీడోత్సవాల్లో కాట్రేనికోన జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. అండర్-17 విభాగం వాలీబాల్‌లో విన్ని, చిన్నారి, సత్యకుమారి, కబడ్డీలో గాయత్రి, లాంగ్‌జంప్‌లో సత్యకుమారి, అండర్-14 వాలీబాల్‌లో శ్రీదుర్గ, జయశ్రీ, షాట్‌పుట్‌లో కాజల్ ప్రతిభచూపగా వారిని ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం అభినందించారు.

జాతీయ సేవా పథక దినోత్సవం

అమలాపురం గ్రామీణం: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. చేయూత ఛారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవికుమార్, ప్రిన్సిపల్ రామారావు, ఏవో కృష్ణారావు, కె.దుర్గారావు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా



యానాంలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కాట్రేనికోన: గెద్దనపల్లిలో మంగళవారం సర్పంచి సీతారామకృష్ణంరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల్లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని అవగాహన కల్పించారు. పి.లక్ష్మణ్, రంగరాజు, భాస్కరరాజు, గిడ్డి నాగరాజు, గోడి వెంకటరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సుబ్రహ్మణ్యం, లోవరాజు, శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానాం: జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్నెస్సెస్ విభాగాల విద్యార్థులు మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని మోదీ సూచించిన విధంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా ఉద్యమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. సమాజ అభివృద్ధిలో తమ వంతు సహాయసహకారాలు అందిస్తున్న విద్యార్థులను ప్రశంసించారు. అనంతరం గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న యానాం శివాలయ స్నానఘట్టం వద్ద శుభ్రం చేసినట్లు పథకం కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరరెడ్డి తెలిపారు. అక్టోబరు రెండు వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సేకరించిన చెత్తను రిక్షాలతో డంపింగ్‌యార్డుకు తరలించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అధికారి టి.గోపి, ఎన్నెస్సెస్ అధికారులు నరేష్, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఓడలరేవులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కె.అగ్రహారంలో అలముకున్న చీకట్లు

విద్యుత్తు వెతలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలోని కె.అగ్రహారంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో దుకాణదారులు, నివాస గృహలవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి వాతావరణం ఉక్కబోతగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు ఆపసోపాలు పడ్డారు. దీనిపై విద్యుత్తు సిబ్బందిని అడగగా ఫీడర్ మరమ్మతులకు గురైందని, రాత్రి 8 గంటలకు సరఫరా పునరుద్ధరించామన్నారు.

సిబ్బంది నిరసన



అమలాపురంలోని గోదాము వద్ద సిబ్బంది నినాదాలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అమలాపురం బైపాస్ రోడ్డులోని మద్యం గోదాము వద్ద మంగళవారం నిరసన తెలిపారు. నూతన మద్యం విధానంలో తమను తొలగించే ప్రయత్నం చేయనుండడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విధానంలో జిల్లావ్యాప్తంగా 300 మంది రోడ్డునపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డిపో మేనేజరు దుశ్యంతరావుకు వినతిప్రతం ఇచ్చారు.

జూద శిబిరంపై పోలీసుల దాడి

కాట్రేనికోన: కాట్రేనికోనలో మంగళవారం కొందరు జూదం ఆడుతున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేసి ఏడుగుర్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు. వారినుంచి రూ.2,030 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



ఎదుర్లంక వారధి వద్ద నిరసనలో జేఏసీ నాయకులు

రఘురామపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి అవమానపరిచిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కేసును, నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పలగుప్తంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. జడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, స్థానిక సర్పంచి చిన్నవరాజు, కుంచే రమణారావు, పినిపే జయరాజు, కుంచే బాబులు, వైస్ ఎంపీపీ సాదే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐ.పోలవరం మండల మాలమహానాడు జేఏసీ డిమాండ్ చేసింది. ఎదుర్లంక వారధి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. రేవు శ్రీను, దుక్కిపాటి సత్యనారాయణ, వడ్డి గౌతమ్, మట్టా గగణవీరుడు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

డ్రెయిన్‌లో పూడిక తీశారు..

సమస్య: కొండాలమ్మ చింత ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – జి.సుబ్రహ్మణ్యం, స్థానికుడు

సమస్య: పెద్దవంతెన వద్ద చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన కొడుతోంది. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలి. – ఎం.వీరబాబు, స్థానికుడు

పరిష్కారం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత, పెద్దవంతెన ప్రాంతాల్లో సమస్యలను ఇన్‌ఛార్జి కమిషనర్ సత్యానారాయణకు తెలుపగా స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్యలను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సమస్య: సావరం మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతోపాటు దోమలు పెరిగాయి. – బాబు, స్థానికుడు

సమస్య: ఎర్రవంతెన రోడ్డులో కాలువపై పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మురుగు ముందుకు వెళ్లడం లేదు. – రామ్, స్థానికుడు

సమస్య: అమలాపురం దక్షిణామూర్తివారివీధిలో చెత్తను రోడ్డుపై పడేస్తున్నారు. తొలగించేలా చర్యలు చేపట్టాలి. – కల్యాణ్, వ్యాపారి

పరిష్కారం: పట్టణంలోని సావరం, ఎర్రవంతెన రోడ్డు, దక్షిణామూర్తివారి వీధిలో సమస్యలు తెలుపగా సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సమస్య: గెద్దనపల్లి పరిధిలో తాగునీటి పైపులైను పగిలి నీరు లీకవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – స్థానికులు

పరిష్కారం: సమస్యను జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

సమస్య: కొప్పిగుంట పంచాయతీ పరిసరాల్లో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించాలి. – గ్రామస్థులు

పరిష్కారం: సమస్య సర్పంచి వెంకటలక్ష్మికి తెలుపగా స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

పారిశుద్ధ్యం.. ప్రశ్నిస్తోంది పరిసరం



పరిపాలనాధికారి కార్యాలయం వెనుక పాంచాలవీధిలో పరిస్థితి

యానాం, న్యూస్‌టుడే: ఒకప్పుడు పరిశుభ్రతకు మారుపేరుగా ఉన్న యానాంలో ప్రస్తుతం ఎటుచూసినా చెత్తాచెదారం, కుండీల్లో కుళ్లిపోయిన ఆహార పదార్థాలు తొలగించక వచ్చే దుర్వాసన భరించలేకున్నాయి. యానాంలో ఒప్పంద పారిశుద్ధ్య సేవలు అందించే హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ చెత్త తొలగింపు పనిని మూడు రోజులుగా నిలిపివేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. రహదారులు తుడిచేవారు, చెత్త ఎత్తేవారు, కాలువల్లో చెత్త నిలవకుండా శుభ్రం చేసేవారులేక ఎటుచూసినా వాసనకొడుతోంది. ఇళ్ల సమీపంలో మున్సిపల్ చెత్త కుండీలు ఉన్నచోట్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. యానాం పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఓ పక్క అడపాదడపా భారీ వర్షం, మరోపక్క వివిధ రకాల వైరల్ జ్వరాలతో జనం ఇబ్బందిపడుతుంటే అంతా పరిశుభ్రంగా ఉండాల్సిన పరిస్థితిలో శుభ్రత పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఆరు నెలలుగా చెల్లింపు నిలిపివేత..

యానాంలో ఒప్పంద పారిశుద్ధ్య సేవలందిస్తున్న హైదరాబాద్‌కు చెందిన హెచ్ఆర్ స్క్వేర్ సంస్థకు ఆరు నెలలుగా ఇవ్వాల్సిన బిల్లుల చెల్లింపును పుదుచ్చేరి స్వపరిపాలనశాఖ నిలిపివేసింది. దీంతో పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలను సంస్థ చెల్లించకపోవడంతో మూడు రోజులుగా వారు పనులు ఆపేశారు. దాంతో ఆదివారం నుంచి యానాంలో చెత్త తొలగింపు లేదు.



యానాం మార్కెట్లో తొలగించని తీరు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

చెత్త తీయక పోవడంతో యానాంలో పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. పగటిపూట కూడా దోమలు విపరీతంగా ముసురుతున్నాయి. యానాంలో డెంగీ తదితర జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– మల్లాడి శామ్యూల్, ఎన్నార్ కాంగ్రెస్ యానాం అధ్యక్షుడు

విభజించకపోవడమే సమస్య

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ తడి, పొడి చెత్తను విభజించకుండా డంపింగ్ యార్డుకు తరలిస్తుండడం వల్లే సమస్య వచ్చింది. కలిసిపోయిన చెత్తను డంపింగ్‌యార్డుకు తేవడంపై స్వపరిపాలనశాఖ డైరెక్టర్ శక్తివేల్‌కు నివేదిక ఇచ్చాం. ఒప్పందం ప్రకారం చేసిన పనికి మాత్రమే బిల్లు చెల్లిస్తామని చెప్పడంతో ప్రతిష్టంభన నెలకొంది. ప్రస్తుతం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తమ శక్తి మేరకు చెత్తను తొలగిస్తున్నారు. మార్కెట్‌ను సాయంత్రం శుభ్రం చేయించామని తెలిపారు.

– ఖండవిల్లి రామకృష్ణ, ఇన్‌ఛార్జి కమిషనర్

మండపేట

•మండపేట •రామచంద్రపురం



విద్యార్థినికి నియామకపత్రం అందజేస్తున్న సత్యం

42 మందికి ఉద్యోగ నియామకాలు

రామచంద్రపురం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు వికాస ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 42 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కాయి. ఐటీ కంపెనీ సొనంటిక్ 30 మంది, హెచ్‌డీబీ బ్యాంకుకు 12 మంది ఎంపికయ్యారని వికాస సంస్థ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వీరికి మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందజేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ద్వారపూడి: మండపేట మండలం ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 293 మందిలో 34 మంది దృష్టిలోపం ఉన్నట్లు కంటి వైద్యుడు సూరంపూడి సత్యనారాయణ గుర్తించారు. వారికి ప్రభుత్వం ద్వారా కళ్లద్దాలు అందజేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయిని విజయజ్యోతి, విద్యా కమిటీ ఛైర్మన్ కంకటాల మురళీకృష్ణ, కోట లక్ష్మణ్, వల్లా వాసు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

ద్వారపూడి: మండపేట మండలం జడ్.మేడపాడు పంచాయతీ పరిధి ప్రధాన డ్రెయిన్‌లో మురుగు పారక, దోమలు పెరిగి స్థానికులు ఇబ్బందులు పడుతుండటంపై 21న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి వి.అమర్‌నాథ్‌చౌదరి స్పందించారు. డ్రెయిన్‌లో పూడిక తీయించి మురుగు పారుదలకు చర్యలు చేపట్టారు.

పురపాలక సిబ్బంది బాధ్యతల స్వీకరణ

మండపేట: రామచంద్రపురం నుంచి బదిలీపై మండపేట పురపాలక సంఘానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్ దంటు శ్రీనివాస్, జేవీవీ సత్యనారాయణమూర్తి, జూనియర్ అసిస్టెంట్ గుబ్బల శ్రీను మంగళవారం విధుల్లో చేరారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి సత్కారం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం సబ్ రిజిస్ట్రార్ యు.గజన్మోహన్ రావు, కొందరు సిబ్బంది బదిలీపై వెళ్లడంతో స్థానిక దస్తావేజు లేఖర్లు మంగళవారం వారిని సన్మానించారు. నూతన సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన తోట శ్రీనివాసరావుకు స్వాగతం పలికారు.

పచ్చదనం.. కళాత్మకం

న్యూస్‌టుడే, అంగర

'మొక్క'వోని వ్యాపకం

మొక్కల్ని పెంచడమే కాదు.. ఇంటికి శోభ తెచ్చేలా తీర్చిదిద్దుతున్నారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరుకు చెందిన రైతు వేగుళ్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి (సత్తిబాబు). ఆయన ఇల్లంతా ఎక్కడ చూసినా పచ్చదనం పెనవేసుకుపోయింది. కేవలం సేంద్రియ ఎరువులు మాత్రమే వినియోగిస్తున్నారు. పలు కుండీల మొక్కల పెంపకాన్ని దినచర్యగా చేసుకున్నారు. ప్రస్తుతం మిద్దెపై సుమారు 800 రకాల మొక్కల్ని పెంచుతున్నారు. 12 రకాల ఆకుకూరలు, 15 రకాల కూరగాయలు, 40 పూలమొక్కలు, 200 ఔషధ మొక్కలు, తీగమొక్కలు ఉన్నాయి. నారింజ, నిమ్మ, దానిమ్మ, సపోటా, బత్తాయి, సీతాఫలం, పంపర పనస, మామిడి, జామ, రేగు, పనస, ఆరటి, డ్రాగన్ వంటి అరవై పండ్ల రకాలు పండిస్తున్నారు. స్ట్రాబెర్రీ, యాలకులు, లిబ్బర్, స్నేక్, జెడ్‌జెడ్ ప్లాంటు వంటి మొక్కలు అబ్బురపరుస్తున్నాయి.



కుండీల్లో వివిధ రకాల తీగ జాతి మొక్కలు

జీవామృతం.. బలవర్ధకం

ఎరువుల వాడకుండా సొంతంగా జీవామృతం తయారుచేసి మొక్కలకు వినియోగిస్తున్నారు. ఒక డ్రమ్ములో 10 లీటర్ల గోమూత్రం, పది కిలోల ఆవుపేడ, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల శనగ పప్పుపిండి, (కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి పప్పు దినుసులు) 190 లీటర్ల నీరు వేసి 15 రోజులపాటు బాగా కలియతిప్పితే 20 లీటర్ల జీవామృతం తయారవుతుంది. మొక్కకు తగిన మోతాదులో పిచికారీ చేయాలి. వేప కషాయం, అల్లం, బెల్లం కషాయం, వెనిగర్, కోడిగుడ్డు పెంకులు, పంచగవ్య వంటివి అవసరం మేరకు వినియోగిస్తారు. నెలకు రెండుసార్లు పుల్లటి మజ్జిగ వేస్తే మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు ఆరోగ్యంగా ఉంటాయని ఆయన వివరించారు.



మిద్దెపై పెంచుతున్న పచ్చని మొక్కలు



పెంచుతున్న మొక్కలతో సత్యనారాయణమూర్తి

కనువిందుగా..

ప్లాస్టిక్ డబ్బాలు, పైపులను అందంగా కళాత్మకంగా కత్తిరించి అందులో మొక్కలు పెంచుతున్నారు. కొబ్బరితాళ్లతో వేలాడదీసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పక్షులు గింజలు తినడానికి వీలుగా వెదురుబుట్టలను అల్లి మిద్దెపై ఉంచుతున్నారు. తీగ జాతి మొక్కలు పెరగడానికి డాబాపై పందిర్లు ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం, సాయంత్రం సుమారు మూడు గంటలపాటు మొక్కల సంరక్షణకు కేటాయిస్తున్నారు. ప్రతి మొక్కకు నీరు వెళ్లడానికి వీలుగా చిన్నచిన్న పైపులతో ఏర్పాట్లు చేశారు.

చిన్న స్థలమున్నా పెంచాలి..

ఇంటి పెరట్లో చిన్నపాటి స్థలం ఉన్నా మొక్కలు పెంపకానికి కేటాయించాలి. కొబ్బరి పొట్టు, నల్ల మట్టి కలిపి మొక్కలు నాటితే, వాటి వేర్లు వేగంగా లోపలికి చొచ్చుకుపోతాయి. మొక్కకు అవసరమైన తడి ఎల్లప్పుడూ అందుతుంది. మిద్దెపై మట్టి బరువు మోతాదు మించకుండా ఉంటుంది.

- వేగుళ్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి (సత్తిబాబు), రైతు, వల్లూరు

ద్వారపూడి అభివృద్ధికి కృషి

ద్వారపూడి, న్యూస్‌టుడే: ద్వారపూడి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం ద్వారపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచి ఈతకోట శిల్పార అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా దొరబాబు, ఉపాధ్యక్షుడు కోట లక్ష్మణ్, భాజపా మండపేట నియోజకవర్గ ఉప సమన్వయకర్త కంకటాల మురళీకృష్ణ, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో ఎమ్మెల్యే వేగుళ్ల పర్యటన నేడు


రాయవరం: చెల్లూరులో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరవుతారని తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై వివరిస్తారని చెప్పారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

సీఎం సహాయనిధికి విరాళం అందజేత

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన దుద్దుకూరి రామతులసి, మాల్యాద్రి(బతానీ చౌదరి) దంపతులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి విరాళం అదజేశారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.1,01116 చెక్కు అందజేశారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న రామతులసి, మాల్యాద్రి దంపతులు

30 వరకు కుల నిర్మూలన చైతన్య సభలు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలో కులనిర్మూలన చైతన్య సభలు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం తెలిపారు. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ద్రాక్షారామ మసీదు కూడలిలో జ్యోతిబాపులె, సావిత్రిబాయిపులె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు ఎం.సాగర్, ఎల్.చందు, కె.శ్రీను, పి.ప్రవీణ్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై పట్టు సాధించాలి

అంగర, న్యూస్‌టుడే: విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై పట్టు సాధించాలని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మాజీ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన కపిలేశ్వరపురం మండలం మాచర జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి అంతరిక్ష విషయాలు, ప్రయోగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయిని రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇస్రో చేపట్టిన ప్రయోగాల గురించి ఉపగ్రహ నమూనాల సహితంగా వివరించారు. శివప్రసాద్ దంపతులను ఉపాధ్యాయ సిబ్బంది సత్కరించారు. న్యాయవాది ఓం ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బాలుర ఆటల పోటీలు

రాయవరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాయవరంలోని శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి బాలుర ఆటల పోటీలు మంగళవారంతో ముగిశాయి. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త సిద్ధాంతపు వీర్రాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కృపారావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి నల్లమిల్లి అప్పారెడ్డి తదితరులు పోటీలను పర్యవేక్షించారు. బుధవారం బాలికల విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు.



ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

మండపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అండర్ 19 విభాగంలో వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలో నిర్వహించే క్రీడల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను మంగళవారం మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. బాల, బాలికల విభాగాల్లో బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, నెట్ బాల్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. మొత్తం 150 మంది క్రీడాకారులు పాల్గొనగా 88 మంది వివిధ పోటీలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పలరాజు, వ్యాయామోపాధ్యాయుడు ఈవీవీ సత్యనారాయణ తెలిపారు.

పేద దంపతులకు మంత్రి ఆర్థికసాయం

రామచంద్రపురం: పట్టణంలో పెద్ద వంతెన వద్ద చెట్టుకింద ఉన్న సిమెంట్ తూరలో ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటున్న మడిమి దుర్గారావు, దుర్గమ్మ దంపతులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.5 వేలు తక్షణ ఆర్థిక సాయంగా అందజేశారు. మంగళవారం ఆయన వెల్ల గ్రామంలో వెళ్తూ అక్కడ ఆగి వారి స్థితిగతులను పరిశీలించారు. టిడ్కో గృహాల్లో ఇంటిని మంజూరు చేయించారు. చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ సొంతింటి కోసం కాళ్లరిగేలా తిరిగారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డులు పట్టుకుని సచివాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ఆర్థికసాయం అందజేశారు.

రామచంద్రపురం విద్యుత్ శాఖ ఈఈగా రత్నాలరావు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.రత్నాలరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జగ్గంపేట ఈఈగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. విద్యుత్ సమస్యలు వెనువెంటనే పరిష్కరించేలా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తానని చెప్పారు.



లడ్డూ ప్రసాదం అపవిత్రంపై నిరసన

రామచంద్రపురం, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని గత వైకాపా ప్రభుత్వం అపవిత్రం చేసిందని నిరసిస్తూ పట్టణంలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తెదేపా కార్యాలయం వద్ద మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి స్వామివారికి వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుంచి మార్కెట్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, పండితుడు చెరుకుపల్లి గణేశ్‌శర్మ బ్రహ్మత్వంలో గోపూజ నిర్వహించి స్వామివారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం డీఎస్పీ, ఆర్డీవో కార్యాలయాల్లోను వినతిపత్రాలు సమర్పించారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు కడియాల రాఘవన్, కూటమి నాయకులు అల్లం శ్రీనివాస్, కంచుమర్తి బాబూరావు, నారపరెడ్డి బలరాం, కవల నానాజి, దంగేటి గౌరీశంకర్, కొట్టువాడ హరిబాబు, పార్టీ అధ్యక్షులు కేసవ రాఘవేంద్ర, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రైతులు పది ఎకరాలు సాగు చేస్తే, కనీసం ఒక ఎకరంలోనైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతి అనుసరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. మంగళవారం వెల్ల గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రబీ పంట తరువాత పొలాలు బీడులుగా వదిలేయకుండా పప్పుధాన్యాలు చల్లుకోవాలని చెప్పారు. గతంలో గ్రూపులకు రాయితీపై ట్రాక్టర్లు ఇచ్చేవారని, ఈసారి వ్యక్తిగతంగా మంజూరు చేస్తామని తెలిపారు. 50 శాతం రాయితీపై బరకాలు అందిస్తున్నట్టు చెప్పారు. రైతులు ధాన్యం అమ్ముకొనేందుకు ఇబ్బందులు లేకుండా సంచులు, సామగ్రి సమకూర్చాలని అధికారులకు సూచించారు.

పామర్రు: వ్యవసాయ శాఖ సూచనలు పాటించి సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించాలని ఉమ్మడి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి.నందకిషోర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం కె.గంగవరం, దంగేరు గ్రామాల్లో ఏవో బలుసు రవి అధ్యక్షతన నిర్వహించారు. రామచంద్రపురం ఏడీఏ ఏఎస్‌వీ రంగారావు, జిల్లా వనరుల కేంద్రం ఏవో మనోహర్, పశువైద్య, ఉద్యానవన, మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

రాయవరం: ఆధునిక యాజమాన్య పద్ధతులతో వరిసాగులో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ అన్నారు. రాయవరంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ చేపట్టిన వివిధ పథకాలను డా.శ్రావణి వివరించారు. సర్పంచి చంద్రమళ్ల రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ సతీష్, జనసేన నాయకుడు దేవిశెట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

అంగర: కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప, టేకి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో రైతు ర్యాలీ వీరవెంకట సత్యనారాయణ క్షేత్రాన్ని సందర్శించారు. రైతుల సమక్షంలో పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించారు. పశు వైద్యాధికారి ప్రసన్న, గ్రామ వ్యవసాయ సహాయకులు హరిబాబు, నాగభూషణం, పుట్టా రామకృష్ణ, మేడిశెట్టి శ్రీనివాస్, నెక్కంటి సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



వెల్లలో ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి సుభాష్

ఉచిత వైద్య శిబిరం

రామచంద్రపురం: స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో మంగళవారం సుఖీభవ ఛారిటబుల్ ట్రస్టు కన్వీనర్ నాగిరెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేసి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మందులు అందజేశారు.

మండపేట: మండపేట రోటరీ క్లబ్, జమాతె ఇస్లామి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ హాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. రోగులకు రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రోటరీ క్లబ్ ఛైర్మన్ నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి, కార్యదర్శి నివాసరెడ్డి, జమాతె రాష్ట్ర కార్యదర్శి షరీఫ్ జిల్లా అధ్యక్షుడు అమిర్, సభ్యులు సయ్యద్ ఇబ్రహీమ్ షరీఫ్ పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాలతోడు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వరి అవినీతికి పాల్పడ్డారని గ్రామానికి చెందిన పలువురు ఈ నెల 12న ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీలో పీడీ మధుసూదన్ దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో ఏపీవో వీరవెంకట సత్యనారాయణమూర్తి మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుల నుంచి లిఖితపూర్వకంగా సమాచారం సేకరించారు. విచారణ నివేదికను పీడీకి అందజేస్తామని ఆయన తెలిపారు.


తాగునీటి ట్యాంకుల శుభ్రం

ద్రాక్షారామ: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో మంగళవారం హసనబాద గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేశారు. సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు ట్యాంకులో దిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇంజినీరింగు అసిస్టెంట్ వంశీ నీటి నాణ్యతను పరీక్షించారు. పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు పనికి తగ్గట్టుగా వేతనాలు పెంచేలా వార్డు సభ్యులు, సర్పంచి నిర్ణయం తీసుకున్నారు. కార్యదర్శి భాస్కరలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ట్యాంకులోకి దిగి సూచనలిస్తున్న సర్పంచి సతీష్‌రావు

వృత్తిలో నిబద్ధతతో గుర్తింపు



విజయశ్రీని సత్కరిస్తున్న ఎంఈవో సూర్యనారాయణ, సర్పంచి రాంబాబు

రాయవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతే గుర్తింపునిస్తుందని ఎంఈవో యరమాటి సూర్యనారాయణ అన్నారు. మంగళవారం లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత విజయశ్రీని సత్కరించారు. సర్పంచి చాట్రాతి జానకీ రాంబాబు, తెదేపా నాయకులు సుంకవిల్లి గంగరాజు, ముప్పాటి కృష్ణ, ఉపాధ్యాయులు చంద్రకళ, కృష్ణవేణి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి రెండో విడత భాజపా సభ్యత్వ నమోదు

మండపేట, న్యూస్‌టుడే: భాజపా ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు ప్రక్రియ తొలివిడత బుధవారంతో ముగియనుందని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరాం తెలిపారు. సెప్టెంబరు 6 నుంచి వప్పటి వరకు 3,120 మంది నమోదు చేసుకున్నారని చెప్పారు. 26 నుంచి అక్టోబరు 2 వరకు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో రెండో విడత సభ్యత్వ నమోదు అక్టోబరు 2 నుంచి 25 వరకు చేసుకోవచ్చని తెలిపారు.

విద్యార్థులు సమాజసేవలో భాగమవ్వాలి

రాయవరం: చదువుతోపాటు సమాజ సేవలోనూ విద్యార్థులు మమేకమవ్వాలని విశ్వమానవతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. మంగళవారం సోమేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచి మొక్కల పెంపకం, సమాజసేవ, యోగసాధన చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సంస్కార విద్యపై ఆన్‌లైన్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు 99666 73111 చరవాణి లేదా www.manavata.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. యోగాభ్యాసంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

మండపేట: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుతంగా ఉంటూ సమాజ సేవకు అంకితం కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం, అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నెహ్రూనాయక్, కోకన్వీనర్ సీహెచ్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మండపేట, న్యూస్‌టుడే: భర్త కాపురానికి తీసుకెళ్లటం లేదన్న మనస్తాపంతో స్థానిక ఏడిద రోడ్డులో పోలేరమ్మ ఆలయం సమీపంలోని పుట్టింట్లో పిల్లే చిట్టివేణి (33) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చిట్టివేణికి, విజయవాడకు చెందిన లారీ యజమాని దిరిశాల ప్రభుకుమార్‌తో 2021లో కులాంతర వివాహం జరిగింది. కొంత కాలం తరువాత భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. 18 నెలల క్రితం మండపేట వచ్చి తల్లి సూర్యావతి వద్ద ఉంటున్నారు. భర్త వేధింపులకు పాల్పడుతున్నట్లు కొద్ది నెలల క్రితం మండపేట పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. కాపురానికి తీసుకెళ్తానని భర్త చెప్పడంతో కేసు ఉపసంహరించుకునేందుకు అంగీకరించారు. సోమవారం రాత్రి కూడా వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారని పోలీసులు తెలిపారు. కాపురానికి తీసుకెళ్లడం లేదన్న మనస్తాపంతో మధ్యాహ్నం తల్లి ఇంట్లో లేని సమయంలో ఫ్యాను కొక్కేనికి చున్నీతో ఉరేసుకుందన్నారు. సంఘటన స్థలాన్ని తహసీల్దారు తేజేశ్వరరావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.



చిట్టివేణి (పాత చిత్రం)

అయిదేళ్ల నిర్లక్ష్యం.. సమస్యలతో సతమతం

న్యూస్‌టుడే, మండపేట

గత వైకాపా ప్రభుత్వ హయాంలో విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో అప్పటి పాలకుల వైఫల్యం కారణంగా సౌకర్యాలు అందుబాటులోకి రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక సంఘం నిధుల్లో టైడ్ గ్రాంటును నిర్దేశించిన పనులకు మాత్రమే ఖర్చు చేయవలసి ఉంటుంది. అన్‌టైడ్ గ్రాంటును మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించుకునే వెసులుబాటు కౌన్సిల్‌కు ఉంది. 2020 నుంచి 2023 వరకు 49 పనులు ప్రతిపాదించగా రూ. 9.62 కోట్లు కేటాయించారు. ఇందులో 34 పూర్తికాగా రూ.4.95 కోట్లు మంజూరు చేశారు. రూ.44.76 లక్షల విలువైన రెండు పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.4.22 కోట్లతో చేపట్టాల్సిన మరో 13 పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

ముందుకురాని గుత్తేదారులు

2020-21లో టైడ్ గ్రాంటు రూ.2 లక్షలతో మున్సిపల్ పాఠశాలలు, పార్కుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు 16సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. 2021-22లో రూ.38.14 లక్షలతో ఒకటి నుంచి 30 వార్డుల్లో సౌకర్యాల కల్పన, రూ.36.53 లక్షలతో ఘన వ్యర్థాల నిర్వహణ పథకం అభివృద్ధికి టెండర్లు పిలవలేదు. 2022-23లో రూ.51.11 లక్షలతో అమృత్ 2.0 పథకం కింద రక్షిత నీటి సరఫరా మెరుగుకు ప్రణాళిక సిద్ధం చేయలేదు. రూ.45.01 లక్షలతో ఘన వ్యర్థాల నిర్వహణ పనులు చేపట్టలేదు. రూ.6.09 లక్షలతో సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్లింగ్ చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు.



24వ వార్డులో నిర్మించాల్సిన రహదారి

● అన్‌టైడ్ గ్రాంటుకు సంబంధించి 2021-22లో రూ.26 లక్షలతో బస్టాండ్ సమీపంలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి టెండర్లు పిలిచినా పనులు ప్రారంభించలేదు. 2022-23లో రూ.18.65 లక్షలతో 12వ వార్డు ఆనంద్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా పట్టించుకోలేదు. 24వ వార్డులో రూ.40 లక్షలతో డంపింగ్ యార్డు నుంచి నివాస ప్రాంతం వరకు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉన్నా పని ప్రారంభించలేదు. రూ.9.50 లక్షలతో సత్యశ్రీ రోడ్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణం ప్రారంభం కాలేదు. రూ.40 లక్షలతో పట్టణంలో ప్రతి ఇంటికి 3 ప్లాస్టిక్ చెత్తబుట్టలు సరఫరా చేశారు. ఆరో వార్డు వైఎస్ఆర్ ఉద్యానంలో రూ. 40 లక్షలతో చేసిన అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు.

బిల్లుల చెల్లింపులో జాప్యంతో ఇబ్బందులు

గతంలో చేసిన నిర్మాణాలకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో కొత్త పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రావటంలేదు. వారికి సుమారు రూ.60 లక్షల బిల్లులు బకాయి ఉంది. కొత్తగా 2023-2024 సంవత్సరానికి టైడ్ గ్రాంటు రూ.1.14 కోట్లు, అన్‌టైడ్ గ్రాంటు రూ.76.88 లక్షలు మంజూరయ్యాయి. వీటికి ప్రతిపాదనలు చేయవలసి ఉంది.

- శ్రీనివాస్, డీఈఈ, మున్సిపాలిటీ, మండపేట